క్లుప్తంగా

వృద్ధురాలి మృతిపై ఆరా



రెడ్డిలపాలెంలో సంఘటనా స్థలం పరిశీలిస్తున్న తహసీల్దార్ రామారావు

కొమ్మాది: కాపులుప్పాడ పరిధి రెడ్డిల పాలెంలో వర్షాల కారణంగా ఆదివారం రేకుల షెడ్డుకూలి, పాల సింహాచలం అనే వృద్ధురాలు మరణించిన సంఘటన తెలిసిందే. ఈ నేపథ్యంలో తహసీల్దార్ రామారావు సోమవారం సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. ప్రమాద వివరాలను అడిగి తెలుసుకున్నారు. వాయుగుండం ప్రభావంతో వర్షాలు పడుతున్నందను ప్రస్తుతం శిథిల భవనాల వద్ద, చెట్ల కింద ఎవరూ ఉండ వద్దని తెలిపారు. లోతట్టు ప్రాంతాలను పరిశీలించి, ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

జోన్-2 ఏసీపీగా షబ్నమ్



పీఎం పాలెం: జీవీఎంసీ జోన్-2 ఏసీపీగా నియమితులైన షబ్నమ్ శాస్త్రి సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన జోన్-3 ఏసీపీగా పని చేస్తూ, ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఆయన మాట్లాడుతూ జోన్ పరిధిలో ప్రభుత్వ భూములను పరిరక్షిస్తామన్నారు. అక్రమ నిర్మాణాలను తొలగించి, బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు.

చిన్న శ్రీను పరామర్శ



పాల రమణారెడ్డిని పరామర్శిస్తున్న చిన్న శ్రీను

కొమ్మాది: జీవీఎంసీ 4వ వార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు పాల రమణారెడ్డిని వైఎస్సార్‌సీపీ భీమిలి నియోజకవర్గ సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు సోమవారం పరామర్శించారు. రమణారెడ్డి తల్లి ఆదివారం సాయంత్రం రేకుల షెడ్డు కూలి మరణించడంతో, కుటుంబ సభ్యులను పరామర్శించారు. ముందుగా ప్రమాదం జరిగిన స్థలాన్ని పరిశీలించారు. ఆయన వెంట ఎంపీపీ దంతులూరి వాసురాజు, కార్పొరేటర్ దౌలపల్లి కొండబాబు తదితరులు ఉన్నారు.

పెద్ద చెరువు పరిశీలన



కొమ్మాదిలో చెరువును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గంటా

కొమ్మాది: జీవీఎంసీ 6వ వార్డు కొమ్మాదిలో రెండు రోజుల నుండి కురుస్తున్న భారీ వర్షాలకు వరద నీరు ఉధృతంగా ప్రవహించింది. ఇదంతా ఇక్కడ ఉన్న పెద్ద చెరువులో కలిసిపోయిన క్రమంలో చెరువు అంతా వరద నీటితో నిండిపోయింది. ఈ నేపథ్యంలో సోమవారం ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఈ చెరువును పరిశీలించారు. చెరువుకు, కొమ్మాది గ్రామానికి ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

ఉక్కు ప్రైవేటీకరణకు 'కూటమి' తహతహ



బింగి హరికిరణ్‌రెడ్డి

తగరపువలస: విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ప్రైవేటీకరణ చేసేందుకు కూటమి ప్రభుత్వం తహతహలాడుతోందని వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి బింగి హరికిరణ్ రెడ్డి అన్నారు. సోమవారం ఆయన చిట్టివలసలో మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ పాలనలో అప్పటి సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రైవేటీకరణను గట్టిగా అడ్డుకున్నారని గుర్తు చేశారు. ప్రస్తుతం కూటమి నేతలు చాపకింద నీరులా ప్లాంట్ ప్రైవేటీకరణకు పూనుకోవడం చూస్తుంటే వేలాది మంది కార్మికుల ఉసురు పోసుకుంటున్నట్టు అర్థం అవుతుందన్నారు. ప్లాంట్‌లో 32 విభాగాలను ప్రైవేట్ సంస్థలకు అప్పగించేందుకు టెండర్లు కూడా పిలిచినట్టు ప్రకటన విడుదల చేశారని, ఈ ప్రక్రియ సెప్టెంబర్ 9న ప్రారంభం అవుతుందని అన్నారు. గత ఎన్నికల సమయంలో ప్రైవేటీకరణను అడ్డుకుంటామని హామీ ఇచ్చి.. ఇప్పుడు ఆంధ్రుల హక్కును సమాధి చేస్తున్న కూటమి ప్రభుత్వ దగాకోరుతనాన్ని కార్మికులంతా విమర్శిస్తున్నారన్నారు. ఉక్కు పరిశ్రమను ప్రైవేటీకరిస్తే వైఎస్సార్‌సీపీ చూస్తూ ఊరుకోదని, ఆందోళనలతో కార్మికులకు అండగా ఉంటుందని స్పష్టం చేశారు.

జలమయం

తెరిపివ్వని వాన

- నీట మునిగిన పొలాలు
- చెరువుల్లా రహదారులు



గ్రావెల్, రాళ్లతో నిండిపోయిన కొండ మెట్ల మార్గం



కొండపై ఆంజనేయస్వామి విగ్రహం దిగువ భాగంలో జారిపడిన గ్రావెల్

కొమ్మాది: మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా భీమిలి బీచ్ రోడ్డు తీర ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. రుషికొండ, తిమ్మాపురం, మంగమారిపేట, ఉప్పాడ తీర ప్రాంత మత్స్యకారులు మూడో రోజు సోమవారం కూడా వేటకు విరామం ప్రకటించారు. సముద్ర కెరటాలు భారీగా ముందుకు చొచ్చుకుని రావడంతో మత్స్యకారులు అప్రమత్తమై బోట్లు, వలలను వేరే ప్రాంతాలకు తరలించుకున్నారు. కె.నగరపాలెంలో వరినాట్లు పూర్తి స్థాయిలో నీట మునిగాయి.

నిలిచిన బోటు షికారు

రుషికొండ బీచ్‌లో పర్యాటకుల సంఖ్య గణనీయంగా పడిపోయింది. వర్షాల నేపథ్యంలో బోటు షికారును నిలిపి వేశారు. లైఫ్‌గార్డులు, మెరైన్ పోలీసులు పర్యాటకులను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తున్నారు. రెండో రోజు కూడా పరదేశిపాలెం నుంచి కాపులుప్పాడ రాకపోకలు నిలిచిపోయాయి. ఇక్కడ గెడ్డ ఉధృతి తారా స్థాయికి చేరింది.

ఇసుకమేట్ల తొలగింపు

సాగర్‌నగర్ వద్ద వరద నీరు ప్రవహించేందుకు దారి లేక జీవీఎంసీ అధికారులు ఇక్కడ బీచ్ వద్ద జేసీబీ ఏర్పాటు చేసి వరద నీటిని దారి మళ్లించారు. ఇటీవల సముద్రం ముందుకు రావడంతో ఇసుక మేట్లు ఏర్పడి ఇక్కడ గెడ్డ నుంచి సముద్రంలోకి పోయే దారి మూసివేశాయి. దీంతో అధికారులు జేసీబీ ఏర్పాటు చేసి ఇసుక మేట్లు తొలగించారు.

సత్యదేవుని కొండ మెట్ల మార్గంలో జారిపడిన గ్రావెల్

తగరపువలస: వర్షాల కారణంగా స్థానిక రమాసత్యనారాయణస్వామి కొండ మెట్ల మార్గంలో సోమవారం ఉదయం భారీగా గ్రావెల్, రాళ్లు జారిపడ్డాయి. కొండ మధ్య భాగంలో ఆంజనేయస్వామి భారీ విగ్రహం దిగువ నుంచి ఇవి కిందకు పడిపోయాయి. ఆ సమయంలో భక్తులెవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. మూడు మలుపులతో కూడి ఉన్న మెట్ల మార్గంలో ఒకవైపు కొండవాలు, మరో వైపు ప్రహరీ రక్షణగా ఉంటాయి. తరచూ వర్షాలకు రాతి భాగం విచ్ఛిన్నమై పగుళ్లు ఏర్పడి ముందుకు తోసుకుని వస్తోంది. ఇలాంటి ప్రమాదకరమైన భాగాలు మొత్తం మెట్ల మార్గంలో దిగువ నుంచి చివరి వరకు ఉన్నాయి. ఇప్పటికే కొండ పైభాగంలో ఆలయం చుట్టూ ప్రాంతం కొంత కుంగుబాటుకు గురయింది. పేరుకే దేవదాయశాఖ ఆధీనంలో ఉన్నా ఈ ఆలయం బాగోగులు ఇప్పటి వరకు చూసింది లేదు. కొండ దిగువ నుంచి పై వరకు ఆలయాలు కూడా శిథిలదశకు చేరుకున్నాయి. కల్యాణాలకు పేరు మోసిన ఈ ఆలయంలో వీటిని కూడా ఇటీవల నిలిపివేశారు.

పొంచి ఉన్న ప్రమాదం

కొండపై ధ్వజస్తంభం కింద భాగంలో కొండ చరియలు కూడా ప్రమాదకరంగా ఉన్నాయి. చెట్ల వేళ్లు చుట్టుకుని ఉండటంతో ప్రస్తుతానికి సమస్య లేకపోయినా భవిష్యత్తులో వీటి నుంచి ప్రమాదం కలగవచ్చని భక్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా దేవదాయశాఖ మేలుకుని మెట్ల మార్గంతో పాటు కొండవాలు ప్రాంతం, ఆలయం చుట్టూ ప్రదేశం పటిష్టతకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ముంపులో వరి నాట్లు

పద్మనాభం: మండలంలో మూడు రోజుల నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు పలు గ్రామాల్లో వరి నాట్లు నీటి ముంపునకు గురయ్యాయి. దీంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. అధికారుల లెక్కల ప్రకారం 199 ఎకరాల్లో వరి నాట్లు నీటి ముంపులో ఉన్నాయి. పాండ్రంగి, సామయ్యవలస, మద్ది, గంధవరం, విలాస్కాన్‌పాలెం, అనంతవరం గ్రామాల్లో ఈ వరి నాట్లు నీటి ముంపునకు గురయ్యాయి. సోమవారం ఒక్క రోజే 91 మిల్లీ మీటర్ల వర్షం కురిసింది.

గోస్తని పరవళ్లు

గోస్తని నది పరవళ్లు తొక్కుతోంది. పాండ్రంగి సమీపాన, మద్ది ఆనకట్టపై నుంచి గోస్తని నది ఉధృతంగా ప్రవహిస్తోంది. మద్ది జంక్షన్‌కు సమీపంలోని పల్లి గెడలో నీరు కల్వర్టును తాకుతూ ప్రవహిస్తోంది. మద్ది, కృష్ణాపురం దివాన్జీ కాలువల్లో నీరు ప్రవహిస్తోంది. పాండ్రంగి, మద్ది, విలాస్కాన్‌పాలెం, పాండ్రంగి, పొట్నూరు గ్రామాల్లోని జాలర్లు వలలకు పని చెప్పారు. గోస్తని నది, కాలువల్లో చేపల కోసం జోరుగా వలలు వేస్తున్నారు.

తహసీల్దార్ పరిశీలన

సామయ్యవలసలోని బీబీజీ లేఅవుట్ పరిసర ప్రాంతాల్లో నీటి ముంపునకు గురైన వరి నాట్ల పొలాన్ని తహసీల్దార్ కె.ఆనందరావు, మండల వ్యవసాయ శాఖ అధికారి ఎంవీఎస్ చలం పరిశీలించారు. పొలంలో నుంచి నీటిని బయటికి పంపించే మార్గం ఏర్పాటు చేశారు.



సామయ్యవలసలో నీటి ముంపునకు గురైన వరి నాట్లు



పాండ్రంగి సమీపంలో ఉధృతంగా ప్రవహిస్తున్న గోస్తని నది



మద్ది ఆనకట్టపై నుంచి ప్రవహిస్తున్న గోస్తని నది



నగరపాలెంలో నీట మునిగిన వరినాట్లు



సామయ్యవలసలో నీటి ముంపునకు గురైన వరి నాట్లను పరిశీలిస్తున్న తహసీల్దార్ ఆనందరావు



సాగర్‌నగర్‌లో వరద నీరు పోయేందుకు దారిని మళ్లిస్తున్న దృశ్యం

ఆర్డీవో పర్యటన

బంగాళాఖాతంలో వాయుగుండం ఏర్పడిన నేపథ్యంలో తీర ప్రాంతంలో ఈదురు గాలులతో కూడిన వర్షంతో తీర ప్రాంత మత్స్యకారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సముద్రంలో కెరటాలు పెద్ద ఎత్తున ఎగసిపడుతూ ముందుకు చొచ్చుకుని రావడంతో రెవెన్యూ అధికారులు అప్రమత్తమయ్యారు. ఆర్డీవో సంగీత్ మాథూర్, తహసీల్దార్ రామారావుతో కలసి మంగమారిపేట, తిమ్మాపురం, ఉప్పాడ తీర ప్రాంతాలు పర్యటించారు. స్థానిక మత్స్యకారులతో మాట్లాడి, సమస్యలు అడిగి తెలుసుకున్నారు. తీర ప్రాంత మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలని అవసరమైన చోట మత్స్యకారులను పునరావాస కేంద్రాలకు తరలించాలని, ఎప్పటికప్పుడు ఇక్కడ పరిస్థితిని పర్యవేక్షించాలని అధికారులకు సూచించారు.



పునరావాస కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో సంగీత్ మాథూర్

పునరావాస కేంద్రం పరిశీలన

మంగమారిపేట జిల్లా పరిషత్ హైస్కూల్లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని ఆర్డీవో సోమవారం పరిశీలించారు. ఇక్కడ ఏర్పాటు చేసిన 5 గదులు, 1 హాలు పరిశీలించి తాగు నీరు, మరుగుదొడ్ల ఏర్పాట్లపై ఆరా తీశారు. వాతావరణం అనుకూలించేంత వరకు మత్స్యకారులు వేటకు వెళ్లవద్దని సూచించారు.

ఎట్టకేలకు కాలువ మరమ్మతులు ప్రారంభం

భీమునిపట్నం: భీమిలిలోని ఆంజనేయ స్వామి ఆలయం వద్ద పూడుకుపోయిన మురుగు కాలువ మరమ్మతులను ఎట్టకేలకు అధికారులు సోమవారం ప్రారంభించారు. ఇక్కడి ఆంజనేయస్వామి ఆలయం వద్ద ప్రధాన కాలువ రెండు నెలలుగా పూడుకుపోతోంది. గతంలో బ్రిటిష్‌వారు చాలా లోతు, వెడల్పుతో ఈ కాలువను నిర్మించారు. దీనికి చుట్టుపక్కల నుంచి వచ్చే కొన్ని చిన్న కాలువలు అనుసంధానమై ఉండటంతో రోజూ పెద్ద ఎత్తున మురుగునీరు చేరుతోంది. అలాగే ఆలయ ప్రాంగణం కింద నుంచి సముద్రంలోకి వెళ్లే విధంగా దీని నిర్మాణం జరిగింది. కాగా, ఇప్పుడు కాలువలో పూడికలు ఏర్పడటంతో ఆలయం వద్ద పెద్ద ఎత్తున మురుగునీరు నిలిచిపోయి, మెయిన్ రోడ్డు పైకి వచ్చేస్తోంది. స్పందించిన అధికారులు బాగు చేయాలని ప్రయత్నించినా, కిందకు బాగా విస్తరించి ఉండటంతో పూడికలు ఎక్కడ ఉన్నాయో తెలియకపోవడంతో పాటు, కాలువను తవ్వే వీలు కూడా లేకపోయింది. అధికారులు పలుమార్లు పరిశీలన చేసిన అనంతరం ఎట్టకేలకు ఆ కాలువకు రెండు వైపులా పనులు మొదలు పెట్టారు. అందులో భాగంగా ఆలయం వద్ద నిలిచిపోయిన నీటిని మోటారుతో తోడిస్తున్నారు. అనంతరం కాలువను పూర్తిగా తవ్వి, సమస్యను గుర్తించి అవసరమైన చర్యలను తీసుకోనున్నారు. చాలా రోజులుగా ఉన్న సమస్య త్వరితగతిన పరిష్కారమవ్వాలని స్థానికులు, ప్రయాణికులు ఆకాంక్షిస్తున్నారు.



ఆలయం వద్ద నిలిచిన మురుగునీటిని మోటారుతో తోడిస్తున్న అధికారులు

విద్యార్థుల గౌరవాన్ని దెబ్బతీసే నేరం ర్యాగింగ్

- అటువంటి దుశ్చర్యలకు దూరంగా ఉండాలి
- నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి
- ఐఐఎంవీలో ముగిసిన యాంటీ ర్యాగింగ్ వారోత్సవాలు

తగరపువలస: విద్యార్థుల భద్రతను, గౌరవాన్ని దెబ్బతీసే నేరం ర్యాగింగ్ అని నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి పేర్కొన్నారు. భవిష్యత్తును అంధకారంలోకి నెట్టే అటువంటి దుశ్చర్యలకు దూరంగా ఉండాలని హితవు పలికారు. ఆనందపురం మండలం గంభీరం ఐఐఎంవీలో సోమవారం నిర్వహించిన ర్యాగింగ్ వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ర్యాగింగ్‌కు సంబంధించి చట్టపరమైన నిబంధనల గురించి తెలియజేశారు. విద్యార్థులు యూజీసీ, ఐఐఎం సంస్థాగత నిబంధనలను పాటించాలని సూచించారు. ర్యాగింగ్ వ్యతిరేక చర్యలపై విద్యార్థులు, తల్లిదండ్రులు, మీడియా, పౌర సమాజం, పోలీసు అధికారుల పాత్రను యాంటీ ర్యాగింగ్ కమిటీ చైర్మన్, డీన్ సూరిశెట్టి విజయభాస్కర్ తెలియజేశారు. పరిపాలన డీన్ ప్రొఫెసర్ కావేరి కృష్ణన్ మాట్లాడుతూ క్యాంపస్‌లో నిఘా, నివారణ చర్యలు, యాంటీ ర్యాగింగ్ కమిటీ, యాంటీ ర్యాగింగ్ స్క్వాడ్ పాత్ర గురించి వివరించారు. వారం రోజుల పాటు విద్యార్థులకు యాంటీ ర్యాగింగ్‌పై నిర్వహించిన వివిధ పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందించారు. అనంతరం ర్యాగింగ్ వ్యతిరేక పోస్టర్‌ను ఆవిష్కరించారు.



ర్యాగింగ్ అనర్థాలపై పోస్టర్ విడుదల చేస్తున్న సీపీ శంఖబ్రత బాగ్చి

- సంగివలస అనిల్ నీరుకొండ మెడికల్ కళాశాలలో యాంటీ ర్యాగింగ్ వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో సీపీ శంఖబ్రత బాగ్చి విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. కార్యక్రమంలో డీన్ డాక్టర్ పీవీ సుధాకర్, సీఈవో చంద్రశేఖర్‌రెడ్డి, ఏవో శివ ప్రసాద్, మధురవాడ జోన్ ఏసీపీ అప్పలరాజు, భీమిలి సీఐ తిరుమలరావు, వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ముంపు గుప్పెట్లోనే గ్రామాలు

166 ఎకరాల్లో నీట మునిగిన వరిపంట

తగరపువలస: ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాల కారణంగా భీమిలి నియోజకవర్గంలో పలు గ్రామాలు ముంపు గుప్పిట్లో చిక్కుకుని విలవిలలాడాయి. భీమిలి మండలంలోని టి.నగరపాలెం నుంచి ఆనందపురం మండలంలోని వెల్లంకి, శొంఠ్యాం పంచాయతీల వరకు వర్షంనీరు సర్వీస్‌రోడ్లపై నిలిచిపోవడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తాయి. దీంతో సోమవారం ఉదయం కూడా సిటీబస్సులు సర్వీస్‌రోడ్లపై కాకుండా నేరుగా జాతీయరహదారి మీదుగా రాకపోకలు సాగించాయి. భీమిలి మండలంలో అమనాం పంచాయతీకి రాకపోకలు నిలిచిపోగా, సోమవారం మధ్యాహ్నానికి పునరుద్ధరించారు.

కూలిన పెంకుటిల్లు

నియోజకవర్గంలో 166 ఎకరాలలో వరి పంట నీట మునిగింది. పలుచోట్ల కూరగాయలు, ఆకుకూరల పంటలు నీట మునిగి దెబ్బతిన్నాయి. ఆనందపురం మండలం కణమాం పంచాయతీ గోరింట గ్రామంలో ములపర్తి సింహాద్రమ్మకు చెందిన పెంకుటిల్లు వర్షాలకు కూలిపోయింది.



తాళ్లవలసలో నీటిలో చిక్కుడు తోట



వెల్లంకి వద్ద సర్వీస్‌రోడ్డు పైకి చేరిన నీటిలోనే ప్రయాణం

అబాకస్ పోటీల్లో మధురవాడ విద్యార్థుల ప్రతిభ



ఛాంపియన్‌షిప్ సాధించిన జ్యోషిత్ రేయాన్ష్, ప్రతిభ చూపిన ఇతర విద్యార్థులు

తగరపువలస: యూనివర్సల్ కాన్సెప్ట్ ఆఫ్ మెంటల్ అర్థమెటిక్ సిస్టమ్స్ (యూసీఎంఏఎస్) ఆధ్వర్యంలో ఈ నెల 16,17 తేదీల్లో హైదరాబాద్‌లోని బాలయోగి స్టేడియంలో నిర్వహించిన 24వ యూసీఎంఏఎస్ జాతీయస్థాయి పోటీల్లో మధురవాడకు చెందిన విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచారు. దేశవ్యాప్తంగా వేలాదిమంది చిన్నారులు పాల్గొన్న ఈ పోటీల్లో డి.జ్యోషిత్ రేయాన్ష్ ఫౌండేషన్ కేటగిరీలో చాంపియన్‌గా గెలుపొందాడు. అదే కేటగిరీలో జి.నిహాస్వి రెండో రన్నరప్‌గా లీశ, శ్యామ్ సంప్రీత్ మెరిట్ అవార్డులు సాధించారు. శ్యామ్ సాత్విక్ ఏ కేటగిరీలో మెరిట్ అవార్డు పొందినట్టు ఫ్రాంచైజీ డైరెక్టర్ ఎం.ఎస్.పల్లవి సుమన్ తెలిపారు.

జోన్-2 పీజీఆర్‌ఎస్‌కు 8 అర్జీలు

కొమ్మాది: మధురవాడ జోనల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)కు 8 దరఖాస్తులు వచ్చాయి. జోనల్ కమిషనర్ కనకమహాలక్ష్మి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఇందులో పట్టణ ప్రణాళికా విభాగానికి 2, ఈఈ వర్క్స్‌కు 3, వాటర్ సప్లై విభాగానికి 3 ఫిర్యాదులు ఉన్నాయి.

జోన్-1లో నిల్...

భీమునిపట్నం: భీమిలి జోనల్ కార్యాలయంలో జెడ్సీ అయ్యప్పనాయుడు ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌కు ఎటువంటి దరఖాస్తులు అందలేదు.

అందాల తీరం.. అధ్వానం

- తీరం పొడవునా వ్యర్థాలు, దుర్వాసన
- సందర్శకుల అసహనం

కొమ్మాది: అందాల సాగరతీరాలు అధ్వానంగా మారుతున్నాయి. ఎటు చూసినా తీరం వెంబడి వ్యర్థాలు దర్శనమిస్తుండగా.. దుర్గంధంతో సందర్శకులు అవస్థలు పడుతున్నారు. ఎక్కడి నుంచో వచ్చి, కాసేపు తీరంలో సరదాగా సేద తీరాలనుకునే పర్యాటకులకు, నగరవాసులకు ఈ వ్యర్థాలు స్వాగతం పలుకుతున్నాయి. వీటిని తొలగించే వ్యవస్థలు, శుభ్రం చేసే సిబ్బంది, వీటి కోసం ఏర్పాటు చేసిన యంత్రాలు, పర్యవేక్షించే అధికారుల జాడే కనిపించడం లేదు. దీంతో సువిశాల సాగరతీరం దుర్గంధభరితంగా మారింది.

డంపింగ్‌యార్డులా..

గుడ్లవానిపాలెం బీచ్, సాగర్‌నగర్ బీచ్, రుషికొండ బీచ్, తిమ్మాపురం బీచ్‌ల వద్ద ఈ సమస్య తీవ్రంగా ఉంది. ఈ తీర ప్రాంతాల పొడవునా కర్రలు, ఫుడ్ ప్యాకింగ్ డబ్బాలు, ప్లాస్టిక్ సీసాలు, వాటర్ బాటిల్స్, ప్లాస్టిక్ కవర్లు, మద్యం సీసాలు, ఇతరత్రా వ్యర్థాలు దర్శనమిస్తున్నాయి. ఒక్కోచోట గుట్టలుగా పేరుకుపోయి డంపింగ్‌యార్డులను తలపిస్తున్నాయి. ఈ వ్యర్థాలను సేకరించడానికి యంత్రాలు ఉన్నా, అధికారులు వీటి నిర్వహణను గాలికి వదిలేశారు. మంత్రులు, కలెక్టర్ ఇతర ఉన్నతాధికారులు వచ్చినప్పుడు మాత్రం తీర ప్రాంతాలను సుందరంగా తీర్చిదిద్దుతున్నారు.



సాగర్‌నగర్ వద్ద సముద్రంలో కలుస్తున్న మురుగు నీరు

తిమ్మాపురంలో...

భీమిలి బీచ్ రోడ్డు తిమ్మాపురం బీచ్ వద్ద నిత్యం షార్ట్ ఫిల్మ్‌ల షూటింగ్స్ జరుగుతాయి. పర్యాటకులు వస్తూ ఉంటారు. అయితే ఇక్కడ ఓ సొసైటీ పేరుతో రొయ్యలను ప్లాట్‌ఫాంలపై ఎండబెట్టి వ్యాపారం చేస్తున్నారు. వీటి వలన దుర్వాసన భరించలేనంతగా ఉంటుంది. ఇక వర్షం పడితే అంతే సంగతి. ఈ ప్రాంతంతో పాటు సమీపంలోని బేవాచ్ పార్కు, తొట్లకొండ వరకు ఈ దుర్వాసన వ్యాపిస్తోంది. దీంతో పర్యాటకులు ఈ ప్రాంతాలకు రావాలంటే భయపడుతున్నారు. ఈ చేపల కల్లాలను వేరే చోటుకు తరలించాలని స్థానికులు, పలువురు పర్యాటకులు కోరుతున్నారు.


సాగర్‌నగర్‌లో...: సాగర్‌నగర్ బీచ్ ప్రస్తుతం కలుషితమవుతోంది. సాగర్‌నగర్‌ను ఆనుకుని ఉన్న ప్రాంతాల వాడుకనీరు గెడ్డ నుంచి ప్రవహించి ప్రస్తుతం ఇక్కడ సముద్రంలో కలుస్తోంది. దీని వలన ఇక్కడికి వచ్చిన పర్యాటకులు దుర్వాసనతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. దీనికి సమీపంలో కోకో ఎరీనా పార్కు ఉన్నా, వాసన భరించలేక సందర్శకులు సేద తీరలేకపోతున్నారు.



గుడ్లవానిపాలెం బీచ్ వద్ద కుప్పలుగా కనిపిస్తున్న వ్యర్థాలు

- గుడ్లవానిపాలెం బీచ్‌కు ఇటీవల పెద్ద ఎత్తున వ్యర్థాలు తీరానికి కొట్టుకుని వస్తున్నాయి. తీరం వెంబడి ప్లాస్టిక్ వ్యర్థాలు ఉండటంతో పర్యాటకులు అసహనానికి గురవుతున్నారు.
- రుషికొండ బీచ్ పరిస్థితి కూడా అదే స్థాయిలో ఉంది. ఈ బీచ్‌లో తీరం వెంబడి వ్యర్థాలే కాదు ఇక్కడికి వచ్చిన పర్యాటకులను కుక్కలు కూడా పరిగెత్తిస్తున్నాయి. ఈ తీర ప్రాంతాలను సంరక్షించడం, పరిశుభ్రంగా ఉంచడం ఎంతో అవసరం. పర్యాటకులు కూడా కుటుంబాలతో వచ్చి ఇక్కడ కాసేపు గడపాలన్నా భయపడే పరిస్థితులు నెలకొన్నాయి. అధికారులు ఇప్పటికైనా స్పందించి తీర ప్రాంత సంరక్షణకు చర్యలు తీసుకోవాలని స్థానికులు, పర్యాటకులు కోరుతున్నారు.

డేటా విశ్లేషణలో క్వాంటం టెక్నాలజీ కీలకం



ప్రసంగిస్తున్న కృష్ణా వర్సిటీ వీసీ రాంజీ

మురళీనగర్: అభివృద్ధి చెందుతున్న సాంకేతిక ప్రపంచంలో డేటా విశ్లేషణకు సంబంధించి క్వాంటం టెక్నాలజీ కీలకం కానుందని కృష్ణా విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ కె.రాంజీ అన్నారు. ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాంలో భాగంగా ఏఐసీటీఈ ఆధ్వర్యంలో పాలిటెక్నిక్ అధ్యాపకులకు 'న్యూమరికల్ అప్రోచ్ ఇన్ డిజైన్ థింకింగ్' అనే అంశంపై కంచరపాలెం పాలిటెక్నిక్ కళాశాలలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రత్నకుమార్ పర్యవేక్షణలో నిర్వహిస్తున్న ఆరు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం ఆయన ప్రారంభించి ప్రసంగించారు. ఫైనైట్ ఎలిమెంట్, ఫైనైట్ డిఫరెన్స్, ఫైనైట్ వాల్యూమ్ పద్ధతులను భవిష్యత్తులో ఏఐ వంటి టెక్నాలజీలో వినియోగిస్తారన్నారు. రాష్ట్ర సాంకేతిక విద్యా శాఖ ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ విభాగం డిప్యూటీ డైరెక్టర్ ఎం.ఎ.వి.రామకృష్ణ మాట్లాడుతూ డిప్లొమా స్థాయిలోనే హ్యూమన్ ఫ్రెండ్లీ డిజిటల్ టెక్నాలజీని పాఠ్యాంశంగా చేర్చాల్సి ఉందన్నారు. దీనివల్ల విద్యార్థులు భవిష్యత్తులో ఏఐ, క్లౌడ్ కంప్యూటింగ్, రోబోటిక్స్ వంటి రంగాల్లో మెరుగైన అవకాశాలను పొందుతారన్నారు. శ్రీకాకుళం పాలిటెక్నిక్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.నారాయణరావు, ఎస్ఎస్‌టీఎల్ అసోసియేట్ డైరెక్టర్ డాక్టర్ గణేష్‌కుమార్ ప్రసంగించారు. శిక్షణకు వివిధ ప్రభుత్వ, ప్రైవేట్ పాలిటెక్నిక్ కాలేజీల ఫ్యాకల్టీలు, ఇంజినీరింగ్ కళాశాలల అధ్యాపకులు, పరిశోధకులు హాజరయ్యారు.